ఈనాడు - ఈటీవీ ఆధ్వర్యంలో..



మధుమేహం, ఈఎన్‌టీ, గుండె, సాధారణ సమస్యలపై 24న అవగాహన సదస్సు

పాలమూరు: మధుమేహం, ఈఎన్‌టీ, గుండె, సాధారణ సమస్యలపై 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఈనెల 24న(గురువారం) మహబూబ్‌నగర్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. ఈ వ్యాధులకు సంబంధించిన సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య నిపుణులు వివరిస్తారు. కొందరికి పుట్టుకతోనూ ఈ వ్యాధులకు సంబంధించిన లోపాలు ఉంటాయి. అలాంటి సమయంలో తీసుకోవాల్సిన చికిత్సలపై సలహాలు, సూచనలు చేస్తారు. ఈ సదస్సుకు హాజరయ్యే వారు నేరుగా వైద్య నిపుణుల ద్వారా తమ సందేహాలను తీర్చుకోవచ్చు.

ప్రవేశం ఉచితం | వేదిక: జడ్పీ సమావేశ మందిరం, మహబూబ్‌నగర్ | సమయం: ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు

డబుల్ ఇళ్ల లబ్ధిదారులకు షాక్

ఒక్కొక్కరికి రూ.10వేలకు పైగా విద్యుత్తు బిల్లుల జారీ



సిద్ధాయిపల్లిలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం



ఓ ఇంటికి వచ్చిన రూ. 14,727 బిల్లు

భూత్పూర్, న్యూస్‌టుడే : భూత్పూర్ పురపాలక సంఘం పరిధి సిద్ధాయిపల్లిలోని రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు విద్యుత్తు బిల్లుల షాక్ తగిలింది. చాలా మంది వినియోగదారులకు రూ.వేలల్లో బిల్లులు రావడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు రెండు పడక గదుల ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో చాలా మందికి బిల్లులు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు రావడంతో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ సంగతి.. : గత ప్రభుత్వం హయాంలో సిద్ధాయిపల్లిలో 288 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించగా ఎన్నికలకు సుమారు ఆరు నెలల ముందు లబ్ధిదారులకు కేటాయించారు. చాలా మంది లబ్ధిదారులు ఇళ్లకు చేరుకోవడంతో విద్యుత్తు శాఖ అధికారులు యాజమాన్య ధ్రువీకరణ పత్రం ఆధారంగా అన్ని విద్యుత్తు మీటర్లు బిగించారు. మీటర్లు బిగించిన అధికారులు బిల్లులు జారీ చేయడంలో తాత్సారం చేశారు. విద్యుత్తు వినియోగించిన లబ్ధిదారులకు సుమారు ఏడాదిన్నర కాలంగా, కొందరికి ఏడాదిగా విద్యుత్తు బకాయి ఉన్నట్లు పేర్కొంటూ ఇటీవలే అందరికీ బిల్లులు జారీ చేశారు. సుమారు 70 మంది వరకు రూ.10వేలకు పైగా బిల్లులు రాగా, కొందరికీ రూ.20వేలు కూడా దాటినట్లు తెలుస్తోంది.

ఒకేసారి రూ.వేలల్లో బిల్లులు రావడం చూసి వినియోగదారులంతా అవాక్కయ్యారు. చాలా రోజులుగా పెండింగ్‌లో పెట్టి ఒకేసారి ఇంత పెద్దమొత్తంలో బిల్లులు జారీ చేయటమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ముందుగానే బిల్లులు ఇస్తే గృహలక్ష్మి పథకం వర్తించేలా దరఖాస్తు చేసుకునేవారమని వాపోతున్నారు. విద్యుత్తు అధికారులు బిల్లుల విషయంలో చొరవ చూపాలని కోరుతున్నారు.

బకాయి చెల్లించాల్సిందే.. : ఇళ్లు వచ్చిన ప్రతి లబ్ధిదారుడికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చిన నాటి నుంచే మీటర్ రీడింగ్ నమోదవుతోంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేకపోవడంతో బిల్లుల జారీలో జాప్యం నెలకొంది. విద్యుత్తు వినియోగించిన ప్రతి లబ్ధిదారుడు బకాయి బిల్లులు విధిగా చెల్లించి సహకరించాలి. గృహలక్ష్మి పథకంలో అర్హులుగా ఉంటే వారు బకాయి చెల్లించి, ఇక నుంచి ఉచిత విద్యుత్తు పొందొచ్చు.

- మెథ్యుశాల, విద్యుత్తు శాఖ ఏఈ

నగదు తీసుకో.. వేలిముద్ర వేసిపో!





ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇదే దందా

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం



ఖిల్లాగణపురంలో పట్టుకున్న బియ్యం మహబూబ్‌నగర్ పట్టణం రవీంద్రనగర్‌లోని ఈ రేషన్ దుకాణానివే



దుకాణాన్ని సీజ్ చేయకుండా తాళం వేసిన అధికారులు

ఇప్పుడు రేషన్ దుకాణాల్లో ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం తప్ప ఏ ఇతర సరకులు పంపిణీ చేయటం లేదు. ఈ లెక్కన రేషన్ డీలర్ దగ్గర డబ్బులే ఉండొద్దు. కానీ ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా డీలర్ ముందట డబ్బులు పట్టుకుని సిద్ధంగా ఉంటున్నారు. రేషన్ దుకాణాలకు వచ్చే లబ్ధిదారులను ఏమాత్రం సంకోచం లేకుండా బియ్యం ఇస్తారా అని నేరుగా అడుగుతున్నారు. వేలిముద్ర వేయించుకుని వారికి బియ్యం కాకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం రేషన్ దుకాణం నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా తెలిసినా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కరినీ పట్టుకున్న దాఖలా లేదంటే ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పట్టుకుంటున్నది పోలీసులే : ఉమ్మడి జిల్లాలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 89,95,931 రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రతినెలా 1,59,386 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. సగం కుటుంబాలు కూడా ఇంటికి బియ్యం తీసుకోవటం లేదు. భారీ మొత్తంలో బియ్యం రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 14న ఖిల్లాగణపురం మండల శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద వాహనంలో ఇద్దరు వ్యక్తులు 19 క్వింటాళ్ల ఉచిత బియ్యం తరలిస్తూ సీసీఎస్ పోలీసులకు చిక్కారు. వారిని ఆరా తీస్తే మహబూబ్‌నగర్‌లోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సమాచారంతో అధికారులు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట, రవీంద్రనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బోర్డు కూడా లేకుండా రవీంద్రనగర్‌లోని చిన్న సందులో నిర్వహిస్తున్న 5వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం తరలించినట్లు గుర్తించి ఆ డీలర్‌పై కేసు నమోదు చేశారు. 17న మానవపాడు మండలం నుంచి 23 క్వింటాళ్ల బియ్యం ఆటోలో పెబ్బేరులోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా సీసీఎస్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసులు పట్టుకుంటున్నారే తప్పా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవటం లేదు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తే పట్టుకోవడం సంగతి అటుంచి వారు డీలర్లకే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అపనమ్మకంతోనే జనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు కాకుండా సీసీఎస్ పోలీసులకే సమాచారం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు బియ్యం పట్టుకుని నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిఘా

దుకాణాలపై నిఘా ఏదీ? : రేషన్ దుకాణాల నుంచి ఉచిత బియ్యం తీసుకెళ్లే వినియోగదారుల ఇళ్ల వద్దకు డీలర్ల ప్రతినిధులు వెళ్లి కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున ధర చెల్లించి బియ్యం సేకరించేవారు. ఆ బియ్యం ఆటోల్లో రైసుమిల్లులకు చేరవేసేవారు. ఇప్పుడు పంథా పూర్తిగా మార్చేశారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని రేషన్ దుకాణంలోనే బియ్యం కొనేస్తున్నారు. ఆ బియ్యం ఏరోజుకారోజు రాత్రి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 84 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతినెలా 11,370 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతాయి. లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని డీలర్లు దాదాపు సగం బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఇదే జరుగుతోంది. ప్రతి నెలా 28వ తేదీ నుంచే బియ్యం కోటా గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతుంది. 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు. దుకాణానికి బియ్యం చేరిన రోజు నుంచే నిఘా పెట్టాల్సి ఉన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవట్లేదు.

నిర్వహణ లేక నీరందక!

తరచుగా తెగుతున్న కేఎల్ఐ బ్రాంచి కాల్వ



ముత్తిరెడ్డిపల్లి వద్ద పాటు కాల్వపై ఉన్న యూటీ ఎక్కి కేఎల్ఐ కాల్వలోకి పారుతున్న వర్షపు నీరు

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వపై నుంచి పాటు కాల్వలు ఉన్నాయి. వర్షపు నీరు పోవడానికి పాటుకాల్వలపై యూటీలు నిర్మాణం చేశారు. భారీ వర్షాలు వస్తే యూటీ ఎక్కిపారి కేఎల్ఐ కాల్వలోకి నీరు ప్రవహిస్తోంది. కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయక, కాల్వ గట్టు తక్కువగా ఉండటం, పాటుకాల్వపై ఉన్న యూటీల నుంచి వర్షపు నీరు ఎక్కి పారుతుండటంతో తరచుగా తెగిపోతున్నాయి.

సామర్థ్యం 30 వేలు.. సాగు 60 వేలు : ఏటా రెండు పంటలకు సాగునీరు ఇచ్చే కేఎల్ఐ బ్రాంచి కాల్వకు వర్షపు నీటిగండం పట్టుకుంది. కేఎల్ఐలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ, ఉప కాల్వల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయానికి ఉన్న ప్రధాన కాల్వకు మూడో కిలోమీటర్ వద్ద పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వ ఏర్పాటైంది. ఈ కాల్వ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కోడేరు, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని కొన్ని గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తుంది. మొత్తం 33 కిలోమీటర్ల పొడవున ఉండగా కోడేరు మండలంలో 12 వేల ఎకరాలు, పాన్‌గల్ మండలంలో 13 వేలు, వీపనగండ్లలో సుమారు 2 వేల నుంచి 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయిదేళ్లుగా మూడు మండలాల్లో మొక్కసారిగా ఆయకట్టు 50 వేల నుంచి 60 వేల ఎకరాలకు సాగు పెరిగింది. ఉప కాల్వల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైనింగ్ లేకపోవడంతోనే..: పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు మొదటి నుంచి సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. 33 కిలోమీటర్ల పొడవునా గత ప్రభుత్వ హయాంలో 2023లో సిమెంట్ లైనింగ్ పనులకు రూ. 60 కోట్లతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పనులకు టెండర్లు పిలవలేదు. సెప్టెంబరులో దాదాపుగా 20 రోజులు కురిసిన భారీ వర్షాలకు ముత్తిరెడ్డిపల్లి, రాజాపూర్ శివారుల్లో బ్రాంచి కాల్వ తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో అధికారులే కాల్వకు గండి పెట్టి వాగులకు వరద నీటిని వదిలారు. తెగకుండా చర్యలు చేపట్టారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉన్న ఉప కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోయాయి. మరి కొన్ని కాల్వల్లో జమ్ముగడ్డి, కంపచెట్లు పెరిగాయి.

నిధులు కేటాయిస్తేనే..

పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ మరమ్మతులకు నిధులు లేవు. జమ్ము గడ్డి, పూడిక తీత, కాల్వ గట్టు పెంచడం, కోతలు పడితే మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు బ్రాంచి, పిల్ల కాల్వల సర్వే చేశాం. రూ. 40 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

- రవీందర్, ఈఈ, కేఎల్ఐ, నాగర్‌కర్నూల్

సస్పెన్షన్ ఎత్తేయాలని జీహెచ్‌ఎంల ఆందోళన



డీఈవో కార్యాలయంలో ముగ్గురు సభ్యుల కమిటీతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంలు

న్యూస్‌టుడే, పాలమూరు : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల వినియోగంలో తప్పులు చేశారని పేర్కొంటూ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వారంతా మంగళవారం ఉదయం డీఈవో కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. తాము ఏ తప్పు చేయలేదని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీల సందర్భంగా నిబంధనల ప్రకారం అంతర్జాలంలో ఆప్షన్స్ పెట్టామని, తమ స్పౌజ్ పనిచేస్తున్న సమీప ప్రాంతాల్లోనే పనిచేస్తున్నా కొందరు కావాలనే సస్పెండ్ చేయించారని వారు ఆరోపించారు. తాము ఫోన్ చేస్తున్నా డీఈవో స్పందించడం లేదని, ఇక్కడ తామంతా బాధ పడుతుంటే ఆయన గద్వాలకు ఎలా వెళ్తారని కార్యాలయంలోని ఏడీ అనసూయను ప్రశ్నించారు. డీఈవో వచ్చే వరకు తాము ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని అక్కడే కూర్చున్నారు. అభ్యంతరాలను రాసివ్వాలని ఏడీ కోరగా ఇప్పటికే మూడు సార్లు సంజాయిషి పత్రాలను రాసిచ్చినా స్పష్టత ఇవ్వలేదని, మళ్లీ రాసివ్వమని జీహెచ్‌ఎంలు తేల్చిచెప్పారు.

- జీహెచ్‌ఎంల స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఆప్షన్ పత్రాలను పరిశీలించడానికి జీహెచ్‌ఎంలు రవీందర్ గౌడ్ (కోటకద్ర ఉన్నత పాఠశాల), వెంకట్రాములు (పోమాల్ ఉన్నత పాఠశాల), విజయ్‌కుమార్ (బీపీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, మహబూబ్‌నగర్)తో డీఈవో గతంలో కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఆందోళన చేపట్టిన జీహెచ్‌ఎంల వద్దకు ఆ కమిటీ సభ్యులు వచ్చారు. ఆప్షన్ల పత్రాల్లో ఉన్న ప్రకారమే తాము నివేదికను తయారు చేశామని, సందేహాలు ఉంటే నేరుగా డీఈవో, ఆర్జేడీకి విన్నవించాలని సూచించారు. తాము తప్పుగా నివేదిక పంపితే తమపై కూడా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. డీఈవో రవీందర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జీహెచ్‌ఎంలు తన కార్యాలయానికి వచ్చినట్లు సమాచారం లేకనే గద్వాలకు వెళ్లానన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వచ్చి జీహెచ్‌ఎంలతో మాట్లాడానని చెప్పారు. సమస్యలు, అభ్యంతరాలు ఉంటే ఆర్జేడీ, పాఠశాల విద్య సంచాలకుల వద్దకు వెళ్లి చెప్పవచ్చని సూచించినట్లు తెలిపారు.



నాపై చర్యలు తగవు : గతేడాది సెప్టెంబర్‌లో జీహెచ్‌ఎంల బదిలీలు జరిగాయి. అప్పుడు నా భర్త థౌర్యా నాయక్ విద్యుత్తు శాఖ ఏడీగా బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల తదితర ప్రాంతాలకు అధికారిగా ఉన్నారు. ఆయన పనిచేస్తున్న ప్రాంతం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాను. ఆప్షన్‌గా బాలానగర్ పాఠశాలను ఎంచుకున్నా. భర్త పనిచేస్తున్న ప్రాంతమైన బాలానగర్‌లోనే విధులు నిర్వహిస్తున్న నన్ను సస్పెండ్ చేయడం దారుణం.

- సరస్వతీబాయి, బాలానగర్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం



15వ ఆప్షన్‌గా ఎంచుకున్నా : నా భర్త హేమంత్‌కుమార్ బోయపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. బదిలీల సందర్భంగా ఆయన పనిచేస్తున్న బడితో పాటు సమీపంలో ఉన్న పాఠశాలలను ఆప్షన్స్‌గా ఎంచుకున్నా. నా భర్త పనిచేస్తున్న పాఠశాలకు సమీపంలో ఉన్న పాఠశాలల్లో నాకు పోస్టింగ్ దక్కలేదు. 15వ ఆప్షన్‌గా ఎంచుకున్న, దూరంగా ఉన్న దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది. నాపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి.

- నాగేంద్రమ్మ, దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం

ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్



ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : దివిటిపల్లిలోని ఐటీ టవర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం సందర్శించారు. భవనాన్ని పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడ కొనసాగుతున్న శిక్షణలు, ఏయే సంస్థల ఉద్యోగులు పనిచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఉన్నారు.

ఇళ్ల కేటాయింపులో అక్రమాలపై విచారణకు ఆదేశం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలో రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, అనర్హులకు ఇళ్లు కేటాయించారని వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ విజయేందిర బోయి స్పందించారు. సమగ్రంగా విచారణ చేసేందుకు 15 మంది అధికారులను నియమించారు. వారు ఈ నెల 23 నుంచి ఇంటింటికి తిరిగి విచారించనున్నారు. దివిటిపల్లిలో 1,024, వీరన్నపేటలో 660, క్రిస్టియన్‌పల్లిలో 310 చొప్పున మొత్తం 1,994 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు గతంలో కేటాయించారు. అనర్హులు, స్థానికేతరులకు పంపిణీ చేశారని, ఒకరికి కేటాయించిన ఇంట్లో ఇతరులు అక్రమంగా నివసిస్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఇళ్లను కేటాయించారన్న ఆరోపణలపై తుది విచారణకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విచారణ తర్వాత తుది నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.

ఈ సారీ.. భరోసా లేదు మరి!



కొత్తకోట, న్యూస్‌టుడే: రైతులకు ఒకే విడతలో రూ.2 లక్షలు రుణమాఫీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంటలకు రైతుభరోసా కూడా ఇచ్చి తీరుతుందని రైతుల్లో గట్టి నమ్మకం ఉండేది. ఆ నమ్మకంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లేశారు. జులైలో రైతుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నప్పటికీ 'రైతు భరోసా' ఎవరికి ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత రాకపోవడంతో వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వడం లేదంటూ మంత్రి స్పష్టం చేయడంతో రైతులకు నిరాశే మిగిలింది.

ఆరేళ్లుగా సాయం..: రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిలో ఉత్సాహం నింపి సాగును క్రమంగా పెంచవచ్చని, పెట్టుబడి కోసం అప్పులు చేయరాదని భారాస హయాంలో రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. 2018 మేలో తొలిసారి పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. తొలి ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు కలిపి రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున ఎకరాకు రూ.8 వేలు అందజేయగా తర్వాత ఏడాది నుంచి ఏటా రెండు విడతల్లో మొత్తం రూ.10 వేలు అందజేస్తూ వచ్చారు. ఇలా క్రమం తప్పకుండా ఆరేళ్ల పథకాన్ని అమలు చేశారు. గత డిసెంబర్‌లో అందాల్సిన యాసంగి రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోగా వాటిని ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. ఇదే పథకాన్ని 'రైతు భరోసా' పేరుతో ఏడాదికి రెండు విడతల్లో రూ.7,500 చొప్పున రూ.15 వేలు అందజేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేస్తూ వ్యవసాయదారులకే కాకుండా స్థిరాస్తి వ్యాపారులకు, గుట్టలకు పుట్టలకు వీటిని అందజేసిందని, నిజమైన రైతుల కంటే బడాబాబులే ఎక్కువ లబ్ధి పొందారని వారిని ఏరి పారేసి రైతులకు భరోసా అందజేస్తామంది. ఈ క్రమంలో జూన్‌లోనే పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. అయినా మంత్రివర్గ ఉపసంఘంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతు భరోసాకు వానాకాలం నిధులకు బ్రేక్ పడింది. యాసంగి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

తెరచుకోని పోర్టల్ : మరోవైపు రైతుభరోసా నమోదు చేసుకునే అవకాశం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు దక్కించుకున్న రైతులు జూన్ నాటికి రాష్ట్ర వ్యవసాయ శాఖ పోర్టల్‌కు సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి దస్త్రాలు బదిలీ కావాల్సి ఉంటుంది. జూన్ తర్వాత ఈ పోర్టల్ తెరచుకోలేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే పలు దఫాలుగా రైతుబంధును కోల్పోగా వచ్చే సీజన్ నాటికైనా రైతుభరోసాను అందుకోవాలని ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత యాసంగి ఇదీ పరిస్థితి..

జిల్లా	లబ్ధిదారులు	ఎకరాలు	నిధులు(రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	1,90935	4,44,853	222.40
నాగర్‌కర్నూల్	2,68,363	7,30.311	365.14
వనపర్తి	1,52,513	3,58,848	179.42
జోగులాంబ గద్వాల	1,51,963	4,47,427	223.69
నారాయణపేట	1,55,511	4,47,252	223.62



- రైతుభరోసా అందుతుందని ఎంతో ఆశ పడ్డాం. పెట్టుబడి సాయం అందుతుందని ప్రైవేటులో వడ్డీలకు తెచ్చుకున్నాం. ఇప్పుడు సాయం దక్కకపోవడంతో పంటలపై వాటిని కట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే యాసంగి పంటల భరోసానైనా విడుదల చేసి రైతులకు అండగా నిలవాలి.

- జలంధర్‌రెడ్డి, కొత్తకోట

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు



ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పౌర్ణమి, దసరా పండగల సందర్భంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ఆర్టీసీ కార్మికులు సమష్టిగా కష్టపడి భారీ ఆదాయాన్ని సమకూర్చారని ఆర్ఎం వి.శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రీజియన్‌లోని ఎక్కువ ఆదాం వచ్చే కృషిచేసిన 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు, అయిదుగురు అద్దె బస్సు డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్, శ్రామిక్ ఒక్కొక్కరికి అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా వనపర్తికి బహుమతి అందజేశారు. ఉప ఆర్ఎంలు శ్యామల, లక్ష్మీధర్మ వివిధ డిపోల డీఎంలు, సహాయ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆయుధాల ప్రదర్శన

మహబూబ్‌నగర్ నేరవిభాగం : పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనను ఎస్పీ డి.జానకి ప్రారంభించగా చూడటానికి పాఠశాలలు, కళాశాలల నుంచి భారీగా విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు రైఫిల్, ఎస్ఎల్ఆర్, ఇన్‌సాస్, ఎక్స్ క్యాలిబర్, ఏకే 47, కార్బన్, బోర్ పంప్ యాక్షన్ గన్, బోర్ డబ్బుల్, బ్రీన్ గన్, మోర్టార్, పెడరల్ గ్యాస్ గన్, యాంటి రోహిట్ గన్ తదితరాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌కు సంబంధించిన పరికరాలను కూడా ప్రదర్శనలో ఉంచారు. బాంబులను నిర్వీర్యం చేసేందుకు వాడే పరికరాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్పీలు రాములు, సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమేశ్, సీసీ రాంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి ఆయుధాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్పీ డి.జానకి

పరిహారం.. స్వాహాపర్వం

గద్వాల పట్టణ ఠాణాలో కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి చేతివాటం ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయాడు. మోసాన్ని నేరుగా న్యాయమూర్తి గుర్తించడంతో పలు మోసాలు వెలుగు చూశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు భూమి బాధితులు పరిహారం పొందారు. పరిహారం న్యాయస్థానం ద్వారా బాధితులు తీసుకున్నారు. బాధితులు తీసుకున్న పరిహారం తాలూకా న్యాయస్థానం రిజిస్టర్లలో రికార్డు అయి ఉన్నాయి. అయితే బాధితుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా రెండోసారి పరిహారం పొందేందుకు(డబుల్ క్లయిమ్) న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి కొందరి సహకారంతో స్కెచ్ వేశాడు. అందులో భాగంగా ఇది వరకే పరిహారం పొందిన వారి పేరిట ఉన్న వివరాలను వైట్నర్ ద్వారా సరి చేసి వేరే వ్యక్తి పేరిట రెండో సారి పరిహారం పొందేందుకు ప్రయత్నించాడు. ఇలా పలు విడతల్లో సుమారు 2016 నుంచి 2021 వరకు అధికారికంగా రూ. 3.08 కోట్లు తన పేరిట, తన భార్య పేరిట డిపాజిట్ చేశారు. అయితే ఈ వ్యవహారం రూ.4 కోట్లకు పైగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.. ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూములను కోల్పోయిన బాధితుల రికార్డులను న్యాయమూర్తి పరిశీలించే క్రమంలో రూ. 52,45,850 విలువ చెక్కు 2021లో ఓ మహిళకు జారీచేయగా, అదే మొత్తంలో పరిహారం పొందిన ఓ వ్యక్తి పేరుపై వైట్నర్(ట్యాంపర్డ్) చేసినట్టు గుర్తించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో రికార్డులను, కంప్యూటర్ డాటాను లోతుగా విచారించడంతో సదరు అధికారి పలు విడతల్లో అక్రమాలకు పాల్పడినట్టు కనుగొని షోకాజ్ నోటీసు జారీ చేశారు. విషయాన్ని హైకోర్టు దృష్టికి న్యాయమూర్తి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశానుసారం రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. న్యాయస్థాన సీనియర్ పర్యవేక్షకురాలు ఫిర్యాదు మేరకు సోమవారం గద్వాల పట్టణ ఠాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారి, అతడి భార్యపై కేసు నమోదైనట్టు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని, ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు ప్రయత్నించిన ఘటనపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

ప్రస్తుతానికి గుర్తించిన రెండోసారి పరిహారం జమ వివరాలు


తేది	నగదు (రూ.)
23.12.2016	3,35,000
18.02.2017	8,68,227
29.04.2017	8,22,180
23.11.2017	21,66,026
16.03.2018	33,03,117
20.05.2019	69,47,120
17.12.2019	85,46,420
09.04.2021	52,45,850
16.08.2021	25,98,250

తపాలా.. పడిలేచిన కెరటంలా

వినియోగదారుల ఆకర్షణకు కొత్త పథకాలు

న్యూస్‌టుడే, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి: పడిలేచిన కెరటంలా తపాలా శాఖ కొత్తపుంతలు తొక్కుతూ, నూతన పథకాల అమలుతో పునరుజ్జీవం పొందుతోంది. ఒకప్పుడు తపాలా అంటే కేవలం ఉత్తరాలు బట్వాడాకే పరిమితం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్త పథకాలతో ప్రజల్లోకి వెళ్తూ ఆదరణ పొందుతోంది. దేశంలోని ఏ ప్రాంతానికైనా పార్సిళ్లు పంపే సౌకర్యం నేడు ఖండాంతరానికి వ్యాపింపజేసింది. కొన్ని ప్రైవేట్ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. కమ్యూనికేషన్ విభాగంలో ప్రైవేటు కొరియర్ సంస్థలు హవా నడుస్తున్న తరుణంలో తపాలా శాఖ మూసధోరణికి స్వస్తి పలికింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు పొదుపు పథకాలతోపాటు, ఇతర సేవలు అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా తపాలా వారోత్సవాలు జరుపుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి సృజన్ నాయక్ తెలిపారు. మేళాలు నిర్వహించి కుటుంబానికంతటికీ ఉపయోగపడే కొత్తపథకాలను ఈనెల 7 నుంచి వారం పాటు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు.

జవసత్వాలు.. : 170ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న తపాలా శాఖ పడిలేచిన కెరటంలా నూతనోత్తేజంతో ముందుకు సాగుతోంది. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడుతూనే బ్యాంకు సేవలు కూడా అందించేందుకు తపాలా బ్యాంకుగా అవతరించి సేవలు అందిస్తోంది.




బిజినేపల్లి మండలం మహాదేవునిపేటలో బాధితులకు రూ.15లక్షల చెక్కు అందిస్తున్న తపాలా అధికారులు

డాక్ నిర్యత్ కేంద్ర..

ఇప్పటివరకు కేవలం దేశంలోనే పార్సిల్లు పంపే సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి డాక్ నిర్యత్ కేంద్ర్ అనే నూతన పథకంతో తపాలా శాఖ విదేశాలకు వినియోగదారులు తమ ఇళ్ల వద్ద నుంచే పార్సిల్ పంపే అవకాశం కల్పించింది. తపాలా కార్యాలయంలో ఆధార్, పాన్‌తో పేరు నమోదు చేసుకుంటే సదరు వినియోగదారుకు ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇంటి నుంచే పార్సిళ్లు బుక్ చేసే అవకాశం ఉంటుంది. తపాలా సిబ్బంది ఆయా అడ్రస్‌కు చేరుకుని పార్సిళ్లు తీసుకెళ్లడం, డెలివరీ చేయడం చేస్తారు. తక్కువ వ్యవధిలో, తక్కువ రుసుముతో ఈ సౌకర్యం ఏర్పాటుచేయడంతో జిల్లా కేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో నిత్యం ఈ పథకం ద్వారా విదేశాలకు పార్సిళ్ల పంపకం పెరగడంతో దాదాపు వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

DAK GHAR NIRYAT KENDRA

ఈ కామర్స్‌తో ఒప్పందం..

ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు శరవేగంగా తమ సర్వీసులు అందిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటూనే పోస్టల్‌శాఖ వాటితో జతకట్టి దేశవ్యాప్తంగా పార్సిల్ సేవలు అందిస్తోంది. దాదాపు ప్రతి గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ సేవలు ఉండటంతో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అమెజాన్‌లో బుక్‌చేసే పార్సిల్లు పోస్టుసిబ్బంది బట్వాడా చేయనున్నారు. దీంతో పోస్టల్‌కు అధనపు ఆదాయం సమకూరనుంది. ఈ కామర్స్ ఒప్పందంతో తపాలా ద్వారా నాణ్యమైన, మన్నికైన సేవలు అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా అధికారి సృజన్‌నాయక్ వివరించారు.



గ్రామీణ ప్రాంతాల్లోనూ 73 రకాల సేవలు..



కామన్ సర్వీస్ సెంటర్ మాదిరిగా తపాలా కార్యాలయాలు కూడా పనిచేస్తున్నాయి. 73రకాల సేవలు (గ్రామీణప్రాంతాలలో) అందిస్తున్నాయి. కరెంటు బిల్లులు, బస్, ట్రైన్ బుకింగ్, పాస్‌పోర్ట్ సేవలు (వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో) అందిస్తున్నారు. పోస్ట్ సేవింగ్‌బ్యాంకు ఖాతాలతో తపాలాబ్యాంకు ఖాతాలను అనుసంధానం చేస్తుండటంతో బ్యాంకు లావాదేవీలు చరవాణీలలోనే చేసుకునే వెసులుబాటు ఉంటోంది. సేవింగ్ ఖాతాలకు ఏటిఎం కార్డు సౌకర్యం కూడా తపాలా శాఖ కల్పించింది. జిల్లా కేంద్రాలలో తపాలా కార్యాలయాల వద్ద ఏటిఎం కేంద్రాలను కూడా ఏర్పాటుచేసింది.దీంతో తపాలా శాఖకు నిత్యం రూ.వేల ఆదాయం సమకూరుతోంది.

బ్యాంకు సేవలతో...

India Post Payments Bank Aapka bank, aapke dwaar

తపాలా కార్యాలయాలు కేవలం ఉత్తరాల బట్వాడా, పొదుపుఖాతాలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు అందించేందుకు ఏడేళ్ల క్రితం ఇండియా పోస్ట్ పేమెంటు బ్యాంకు గా సేవలు మొదలు పెట్టింది. వీటి ద్వారా ఆధార్ ఎనబుల్ సిస్టంతో లబ్ధిదారుల ఇండ్లవద్దే వారి బ్యాంకు లావాదేవీలు, చెల్లింపులు చేస్తోంది. ప్రమాదబీమా, ఇతర బీమా పథకాలు అందిస్తోంది. తపాలా బ్యాంకు ఏర్పాటుతో రుణాలు మంజూరుకు కూడా శ్రీకారం చుడుతోంది. ఇతర బ్యాంకులు ఏవిధమైన సేవలు అందిస్తాయో, వాటికి దీటుగా గ్రామాలలో తపాలా బ్యాంకు సేవలు అందించేందుకు తపాలా శాఖ నడుంబిగించింది. దీంతో తపాలా శాఖ ఆర్థికపరిపుష్టితో పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఆదరణ బాగుంది..



చిన్నమొత్తాల పొదుపుఖాతాలతో పాటు తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, రికరింగ్ డిపాజిట్టు, సేవింగ్ ఖాతాలు, ఈ-సేవ, సుకన్య సమృద్ధి యోజన పేరిట ఆడపిల్లలకు పొదుపు పథకాలు ఆదరణ పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చెల్లింపులు, ఆసరా పింఛన్లు బయోమెట్రిక్ ద్వారా చెల్లిస్తున్నాం.. అటల్ పింఛన్ యోజన, సీనియర్ సిటిజన్ పథకం, ప్రధాన మంత్రి జీవన బీమా, మంత్లీ ఇన్ కమ్ పథకం, తదితర పథకాలున్నాయి. ఏడాది వ్యవధిగల ప్రమాదబీమా పథకంలో రూ.599 ప్రీమియం చెల్లించి రూ. 10 లక్షల పరిహారం పథకం, రూ.799 చెల్లిస్తే రూ.15లక్షలు పరిహారం అందనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చాం.

- భూమన్న, వనపర్తి డివిజన్ పర్యవేక్షకులు

చేనేత సహకార సంఘం పనితీరు భేష్

అమరచింత, న్యూస్‌టుడే: అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సహకార సంఘం పనితీరు స్ఫూర్తిదాయకంగా ఉందని వివిధ రాష్ట్రాల నాబార్డ్ అధికారులు కొనియాడారు. పట్టణ శివారులోని సహకార సంఘాన్ని మంగళవారం కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాబార్డ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల చేయూతతో అమరచింత పట్టణంలోని చేనేత కార్మికులు సంఘం ఎలా ఏర్పాటు చేసుకున్నారో అమరచింత సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ వారికి వివరించారు. చేనేత కార్మికుడు ఒక యజమాని వద్ద చేనేత పని చేయకుండా స్వయంగా ఇక్కడ మగ్గం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా విక్రయించడంతో, వచ్చిన లాభాన్ని ప్రతి ఏడాది తీసుకోవడం జరిగిందన్నారు. ఇంట్లో మగ్గం ఏర్పాటుకు స్థలం లేనివారు కూడా ఇక్కడ నేత పనిలో ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. సంఘం ద్వారా జరిగే ప్రతి ఖర్చు జమ ఖర్చుల్లో నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నాబార్డు ద్వారా తెలియజేస్తున్నట్లు వివరించారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించి వారికి వచ్చే సరైన వేతనాలతో అప్పు చెల్లించే విధంగా చేశామన్నారు. కర్ణాటక డీజీఎం సతీష్ కర్ర, బీఆర్‌డీ డీజీఎం యోగేష్, నాబార్డ్ అధికారి షణ్ముఖ చారి, డీసీసీబీ మేనేజర్ నబీ, సభ్యులు పాల్గొన్నారు.


మగ్గంపై నేస్తున్న చీరను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

24న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఈ నెల 24న సీతారాముల కల్యాణం ఏర్పాటు చేసినట్లు కోదండ రామాలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండరామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ సూచించారు.

చదువు రాకపోయినా ఆంగ్లంలో చేవ్రాలు!

సిబ్బంది పేరిట దొంగ సంతకాలతో నిధులు స్వాహా

వారంతా కిందిస్థాయి సిబ్బంది.. చెప్పిన పని చేసి వెళ్లడం తప్పా.. ఏనాడు ఇదేంటని ప్రశ్నించలేని అమాయకత్వం.. ఎన్నికల సందర్భంగా వారి పేరిట ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయి. వారికి తెలియకుండా అధికారులే దిగమింగారు. కనీస చదువు రాని వారు ఆంగ్లంలో సంతకం చేసిన డాక్యుమెంట్ బయటపడటంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన సదరు అక్రమార్కులు సిబ్బందిని పిలిచి తలా కొంత ఇస్తాం తీసుకోండి అంటే ఆత్మాభిమానంతో 'మాకొద్దంటూ..' వెళ్లడం కొసమెరుపు.

- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్నికల సమయంలో పనిచేసిన కార్మికులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా తప్పుడు సంతకాలు పెట్టుకొని నిధులు డ్రా చేసుకున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. ఎంపీ ఎన్నికల సమయంలో నిధుల విషయంలో పక్కదారి పట్టించారనే విమర్శలున్నాయి. కలెక్టరేట్‌లో స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గార్డెన్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం 20 మంది వరకు ఎంపీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించారు. కాని ఎవ్వరికి డబ్బులు ఇవ్వలేదు. ఒక్కరికి మాత్రమే రూ.18 వేలు చెల్లించారు. మిగతా వారికి డబ్బులు ఇవ్వకపోగా 13 మందికి రూ.18వేల చొప్పున డబ్బులు చెల్లించినట్లుగా దొంగ సంతకాలు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. గార్డెన్‌లో పని చేసే వారికి చదువు రాదు కానీ రెవెన్యూ స్టాంప్‌పై ఆంగ్లంలో సంతకాలు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. అన్ని ఒక్కరే సంతకాలు పెట్టినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో ఇటీవల కలెక్టరేట్‌లో ఉండే అధికారులు పనిచేసిన వారిని పిలిచి రూ.2వేలు, రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో తమకు ఈ డబ్బులు వద్దంటూ వెళ్లిపోయారు. జిల్లాలో ఎన్నికల విధుల చెల్లింపుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారోనని ఉత్కంఠ నెలకొంది.


రెవెన్యూ స్టాంప్‌లపై తప్పుడు సంతకాలు పెట్టినట్లుగా బయటికి వచ్చిన పత్రాలు





ఇదీ అంగన్వాడీ దుస్థితి

అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి వసతి సమస్యలు ఎదుర్కొంటున్నాయో ఈ చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఊట్కూరు మండలం పులిమామిడిలో సరైన భవనాలు లేక నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో దాదాపుగా 18 మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుత భవనంలో ఒక గది, వరండా మాత్రమే ఉన్నాయి. గదిలో నాలుగు కేంద్రాల సామగ్రి ఉంచడానికే చాలడం లేదు. వరండాలో 72 మంది పిల్లలను కూర్చోబెట్టి నాలుగు వైపులా నలుగురు టీచర్లు పర్యవేక్షిస్తుండటాన్ని చిత్రంలో చూడొచ్చు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడలు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు మంగళవారం కల్వకుర్తికి చేరుకున్నారు. గురుకుల సొసైటీ పరిధిలోని మొత్తం 16 పాఠశాలల నుంచి సుమారు 540 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు తెలిపారు.

కోయనగర్ సమాఖ్య ఆర్పీ శ్రీలతపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాల డబ్బులను పక్కదారి పట్టించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణం వేంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీలత మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్నారు. 2017 మార్చి నుంచి ఆమె కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 స్వయం సహాయక సంఘాలకు చెందిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు డబ్బులు రూ.1,49,36,205 పక్కదారి పట్టినట్లు విచారణ తేలిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. ప్రాజెక్టు 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,508 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు జలాశయం నీటి మట్టం 884.30 అడుగులుగా (211.4759 టీఎంసీలు) ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల జలాశయం నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కుల వరద నీళ్లు శ్రీశైలంలోకి చేరుతోంది.


గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో రజతం


రజతం సాధించిన జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం వరించింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టును అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి సాదిఖ్‌అలి, ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్, సభ్యులు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, శిక్షకులు కపిల్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి వేధింపులు తాళలేక ఈవో వినోద మంగళవారం నిద్ర మాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా

మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ఉంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలాలా ఉన్నాయి.. 2022 నవంబరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా వినోద ఎంపికయ్యారు. పెబ్బేరులో విధుల్లో చేరాల్సి ఉండగా అప్పటి డీడబ్ల్యూవో పుష్పలత కార్యాలయ అవసరాల నిమిత్తం ఆమెను డిప్యూటేషన్‌పై జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఈవోగా తీసుకున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మమ్మ.. వినోదను పెబ్బేరు వెళ్లాలని ఒత్తిడి చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కొంత సమయం కావాలని తర్వాత వెళ్తానని చెప్పినా వినకుండా లక్ష్మమ్మ సోమవారం ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. లక్ష్మమ్మ, మరో అధికారి వేధింపులతో మనస్తాపం చెంది నిద్ర మాత్రలు వేసుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సూపర్‌వైజర్ల కొరత వల్ల ఆమె స్థానానికి వెళ్లాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై పర్యవేక్షణ ఉండాలని అందుకోసం తప్పకుండా వెళ్లాలని సోమవారం ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. బాధితురాలు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలన్నారు.

వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

మేడ్చల్, న్యూస్‌టుడే: వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీఐపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిస్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తన గది లోపల నుంచి గడి పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం: ఒకరి దుర్మరణం

కృష్ణా, న్యూస్‌టుడే : వాసూనగర్ ఆర్టీవో చెక్‌పోస్ట్ ఎదురుగా ఆగి ఉన్న లారీని బైకుతో ఢీకొని మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) మృతి చెందాడు. మంగళవారం కొత్తపల్లి నుంచి కర్ణాటకలోని దేవసూగూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను దేవసూగూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శేఖర్‌కు భార్య, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.


శేఖర్

అప్పు వివాదం... పరస్పరం కేసులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అప్పు విషయంలో చోటుచేసుకున్న వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తీకేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00



మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

సమస్య: మండలంలోని బస్వాపూర్ గేటు నుంచి నార్లోనికుంట్ల వరకు రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - రమేష్, నార్లోనికుంట్ల

సమాధానం: రహదారికి మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగిస్తాం. - సత్యవర్ధన్, ఏఈ దేవరకద్ర

- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

సమస్య: మహమ్మదాబాద్‌లో ఆంజనేయస్వామి ఆలయం నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు పలుచోట్ల మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ జరిగి నీరువృథాగా పోతోంది. - శ్రీనివాస్, స్థానికుడు.

సమాధానం: సిబ్బందిని పంపి లీకేజీలు సరిచేయిస్తాం. - రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి.

- న్యూస్‌టుడే, మహమ్మదాబాద్

తెరపై ఈనాడు

శ్రీనివాస - **విశ్వం**, తిరుమల - **వెట్టయాన్**, బాలాజీ - **జనక అయితే గనక**, వెంకటేశ్వర - **దేవర**, వెంకటాద్రి - **మా నాన్న సూపర్ హీరో**, మైత్రి శ్రీకృష్ణ - **సలార్** (తెలుగు)

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

ప్రతిభా పోటీలతో.. భవిష్యత్తుకు బంగారు బాటలు



బహుమతులు అందుకున్న శ్రీ పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రతిభ, వైస్ ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి



గీతశ్రీ పాఠశాల విజేతలతో ఛైర్మన్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బాల్‌రాజ్

జడ్చర్ల, న్యూస్‌టుడే : ప్రతిభా పాటవ పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, శక్తిసామర్థ్యాలు బయటకు వస్తాయని, భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని వక్తలు అన్నారు. జడ్చర్లలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో రెండు పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. శ్రీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఎం.భవ్య ప్రథమ, ఎనిమిదో తరగతి విద్యార్థి రిత్విక్‌రెడ్డి ద్వితీయ, తొమ్మిదో తరగతి విద్యార్థి నిషాంత్ తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులను అందుకున్నారు. ప్రిన్సిపల్ ప్రతిభ మాట్లాడుతూ కొన్నేళ్లుగా 'ఈనాడు' నిర్వహిస్తున్న పోటీలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. వైస్ ప్రిన్సిపల్ శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. గీతశ్రీ సీబీఎస్‌ఈ పాఠశాలలో విద్యార్థులు ప్రతిభ పోటీల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థి శ్రీవిగ్నేష్ ప్రథమ, తొమ్మిదో తరగతికి చెందిన కాజల్ జారా ద్వితీయ, తొమ్మిదో తరగతి విద్యార్థిని లహరి తృతీయ బహుమతులు సాధించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పాఠశాల ఛైర్మన్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈనాడు' అధిపతి రామోజీరావు శక్తిగా వ్యవహరించారని, సమాజాన్ని ఆయన ఎంతో ప్రభావితం చేశారని కొనియాడారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

18 మంది పంచాయతీ కార్యదర్శులకు శ్రీముఖాలు జారీ

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : పంచాయతీ నిధుల దుర్వినియోగంపై 'ఈనాడు' మహబూబ్‌నగర్ సంచికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో జయరామ్‌నాయక్ స్పందించారు. మండలంలోని 18 మంది పంచాయతీ కార్యదర్శులకు శ్రీముఖాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీలలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పారిశుద్ధ్యం కోసం కొనుగోలు చేసిన సామగ్రి వివరాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణ అమలుచేయాలి

పాలమూరు, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఉండాలని, తక్షణమే వర్గీకరణను అమలు చేయాలని మాదిగ విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీయూలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈ నెల 24న వరంగల్‌లోని కాకతీయ విశ్వ విద్యాలయంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు శ్రీను మాదిగ, మమత మాదిగ, సంధ్య, జ్యోతి, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : బాదేపల్లి పెద్ద గుట్టపై ఉన్న రంగనాయకస్వామి ఆలయాన్ని సోమవారం దేవాదాయశాఖ అధికారులు వీణాధరి, సత్యంధర్‌రెడ్డి సందర్శించారు. ఆలయ నిర్వహణ పరిస్థితిపై పరిశీలించారు. రంగనాయకస్వామి గుట్టపై జరిగిన సమీకరణ పరిస్థితిపై వారు విచారణ చేశారు. భక్తులు పలు సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయాన్ని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని రవితేజగౌడ్ హైకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఆలయాన్ని సందర్శించి పరిస్థితిపై పరిశీలించామని.. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని మంగళవారం దేవదాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

ముడా ఛైర్మన్ ప్రమాణస్వీకారానికి మంత్రులకు ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఛైర్మన్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంత్రులను కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు రాజధానిలో మంత్రి దామోదర రాజనరసింహ, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు తదతర మంత్రులను కలిసి హాజరు కావాలని కోరారు. ఈ నెల 23న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముడా ఛైర్మన్‌గా లక్ష్మణ్‌యాదవ్ పదవీ బాధ్యతలను స్వీకరిస్తున్నారని తెలిపారు. ముడా నూతన ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ తదితరులు ఉన్నారు.

డీసీసీబీ శాఖ ఏర్పాటుకు కృషి

మిడ్జిల్ : మండల కేంద్రంలో రైతు ప్రయోజనాల దృష్ట్యా డీసీసీబీ శాఖ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్ గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాములును కలిసి పరామర్శించారు. మండల ప్రజలు, రైతులకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

తప్పెవరిది?

న్యూస్‌టుడే, జడ్చర్ల న్యూటౌన్ : మిడ్జిల్ గ్రామ శివారులో రెండు సర్వే నంబర్లలో ఏళ్ల క్రితం వ్యవసాయ భూమిని పంచాయతీ అనుమతి లేకుండా ప్లాట్లుగా విక్రయించిన పట్టాదారు.. ధరణి వచ్చిన తరువాత మారింది. గతంలో అమ్మిన వ్యక్తినే భూమి యజమానిగా ధరణిలో చూపించారు. ఇదే అవకాశంగా రెవెన్యూ అధికారులు, తాత్కాలిక సిబ్బందితో కుమ్మక్కై మరోమారు విక్రయించారు. 'ఇదో భూ దందా' శీర్షికతో ఈనెల 17న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కాగా వ్యవహారం బయటకు వచ్చింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ కార్యాలయం అధికారుల కనుసన్నల్లోనే జరిగినా తమను తాము రక్షించుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వటంతో పాటు పట్టాదారుపై పోలీసులకు ఫిర్యాదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన నియామకమైన ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఏళ్లకాలంగా తిష్ట వేశారు. కార్యాలయాన్ని శాసించడమే గాకుండా కేటాయించిన పనులు వదిలి భూముల దస్త్రాలు, రిజిస్ట్రేషన్ తదితర ప్రధాన విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు ఉన్నా కీలక దస్త్రాలు ప్రైవేటు వ్యక్తి చేతుల్లో ఉండటంతో భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆపరేటర్ సహాయంతోనే ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్‌తో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించినట్లు వినిపిస్తోంది. అమ్మిన భూమిని మళ్లీ మరొకరికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆరు మాసాల క్రితం ప్రయత్నించినా అప్పటి తహసీల్దార్ నిరాకరించడంతో ఆగిపోయింది. భూముల అక్రమ పట్టాతో పాటు పలు గ్రామాల్లో భూవివాదాలకు కారణమవుతున్న తాత్కాలిక ఉద్యోగికి జిల్లా స్థాయిలో పలుకుబడి ఉందన్న ప్రచారంతో ఫిర్యాదు చేసేందుకు కూడా రైతులు జంకుతున్నారు. కల్యాణలక్ష్మి సాయం,, రైతుబీమా పరిహారం, భూపట్టాలు, రెవెన్యూ రికార్డుల నకళ్లు.. ఇలా ఏ పని కావాలన్నా మిడ్జిల్ తహసీల్దార్ కార్యాలయంలో ముందుగా డబ్బులు ముట్టచెప్పాలనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకుంటే నెలల తరబడి కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తుందని, పనులు వదులుకుని రాలేక అడిగినంత ముట్ట చెబుతున్నామని బాధితులు చెబుతున్నారు.

కురుమూర్తి ఉత్సవాలకు ముస్తాబు



జాతరకు ముస్తాబైన రాజగోపురం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామివారి ఉత్సవాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని, రాజగోపురం, హుండీలు, మాన్ విగ్రహాన్ని రంగులు వేసి శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసేందుకు ఆలయ అధికారులు కసరత్తు చేయుచున్నారు.

'నిందితుడిని ఎందుకు అరెస్టు చేయడం లేదు?'

మహబూబ్‌నగర్ పట్టణం : సర్వే నంబరు 523లోని ప్రభుత్వ భూమిలో అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు ఎందుకు అరెస్టు చేయడం లేదని పాలమూరు అభివృద్ధి ఫోరం అధ్యక్షుడు మున్నూరు రవి ప్రశ్నించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిందితుడిని కాపాడేందుకు మాజీ మంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఫోరం సభ్యులు మైత్రి యాదయ్య, విశ్వనాథ్‌రావు, వెంకటేశ్, పటేల్ వెంకటేశ్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు



పాతమొల్గరలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, న్యూస్‌టుడే : మద్దతుధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించవద్దని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో పాతమొల్గరలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం ముందుచూపుతో వెళ్తుందన్నారు. వరి కోతల ప్రారంభానికి ముందే అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మద్దిగట్ల మద్దికాన్‌చెరువులో 2లక్షలు, పాతమొల్గరలో 2లక్షల చేపపిల్లలను ఎమ్మెల్యే చెరువుల్లో వదిలారు. అనంతరం భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో 18మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు, అశోక్ రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, ఏవో మురళీధర్, డిప్యూటీ తహసీల్దార్ గీత, నాయకులు పాల్గొన్నారు.

72 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ జట్టు విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ కోసం ముందస్తుగా ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. మంగళవారం పిల్లలమర్రి దారిలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన తొలి పోరులో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గాను 47 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. అక్షయ్ 84, అరుణ్ 46, కార్తిక్ 24 పరుగులు చేశారు. నారాయణపేట నుంచి ఎజాజ్ 5, రాజు 2 వికెట్లు తీశారు. నారాయణపేట జట్టు లక్ష్య ఛేదనలో చతికిలపడి 35.3 ఓవర్లలో కేవలం 148 పరుగులు చేసి ఓడింది. తరుణ్ 30, అద్నాన్ 28 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి ముఖీత్ 4, అంజి 3 వికెట్లు తీశారు. పోటీలను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రారంభించారు. శిక్షకుడు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ దేశం కోసం తమ ప్రాణాలను అర్పించారని వారి బలిదానం దేశం ఎన్నటికీ మరచిపోదని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాది అన్నారు. మంగళవారం రెడ్‌క్రాస్ భవన్‌లో మిల్లీ మహాజ్ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధులు అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ స్మారక సభలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మిల్లీ మహాజ్ ప్యాట్రన్ అన్వర్‌పాషా, ప్రతినిధులు తఖీహుసేన్, జాకెర్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు నటరాజ్, నాయకులు సమద్‌ఖాన్, నూరుల్ హసన్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సివిల్స్‌లో విజయం



ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష రాస్తున్న విద్యార్థినులు, చిత్రంలో ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు

పాలమూరు, న్యూస్‌టుడే: సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అర్హత పరీక్షలో రాష్ట్రంలోనే ఉచిత శిక్షణను అందిస్తున్న ఏకైక కళాశాల ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అని ప్రిన్సిపల్ డా.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కళాశాల సమావేశ మందిరంలో సివిల్ సర్వీసెస్ అర్హత పరీక్షను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బీసీ అధ్యయన కేంద్రం సహకారంతో ఏడాది 2 సార్లు 150 గంటల చొప్పున శిక్షణ అందిస్తామన్నారు. ప్రతి బ్యాచ్‌లో 150 మంది విద్యార్థినులను పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అన్ని రకాల రిజర్వేషన్ల ప్రకారమే ఎంపికలు ఉంటాయని సూచించారు. ప్రణాళికతో చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. అర్హత పరీక్షలో 385 మంది విద్యార్థినులు పరీక్షలు రాశారు. అందులో 150 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.పద్మ, అధ్యాపకులు అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, శ్రీదేవి, వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో నీటి సమస్య పరిశీలన

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: దివిటిపల్లి రెండుపడక గదుల ఇళ్ల కాలనీలో నీటి సమస్యను ఎంపీడీవో కరుణశ్రీ మంగళవారం పరిశీలించారు. కాలనీలో నీటి సమస్యపై సోమవారం ప్రజావాణిలో ఇళ్ల యజమానులు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో కలిసి వీధుల వెంట తిరిగి పైపులైన్లను, కుళాయిలను, ట్యాంకును పరిశీలించారు. కాలనీలో చాలా వరకు యజమానులు నివాసం ఉండడం లేదని, తాళాలు ఉన్న ఇళ్ల ముందు శుద్ధజలం వృథాగా పోతుండటంతో ఎత్తు ప్రాంతంలోని ఇళ్లకు నీరు అందడం లేదని ఎంపీడీఓ గుర్తించారు. యజమానులు లేని ఇళ్ల ముందు కుళాయిలకు తక్షణమే ఆన్‌ఆఫ్ బిరుడాలు బిగించాలని, తాళాలు ఉన్న ఇళ్లను గుర్తించి వివరాలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

రాత పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆందోళన

పాలమూరు : ఒక ఉద్యోగానికి నిర్వహించిన ఎంపిక పరీక్షలో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆందోళన చేశారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఏఆర్టీలో ఒక కౌన్సెలర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు భర్తీకి ప్రకటన ఇవ్వగా 24 మంది దరఖాస్తు చేశారు. ఈ నెల 18న రాత పరీక్ష నిర్వహించారు. అక్కడే పనిచేసే ఓ ఉద్యోగి భార్య పరీక్ష రాయగా 30 మార్కులకు 28 వచ్చాయి. మిగతా అభ్యర్థులకు 11 నుంచి 17 వరకు మార్కులు వచ్చాయి. అనుమానం వచ్చి అధికారులు పరీక్షను రద్దు చేయించారు. మంగళవారం ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో మళ్లీ పరీక్ష నిర్వహించగా 22 మంది హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను ప్రకటించకుండా టాప్-5గా కొందరి వివరాలు చెబుతున్నారని, ఏ అభ్యర్థికి ఎన్ని మార్కులు వచ్చాయో నోటీస్ బోర్డుపై ఎందుకు ప్రదర్శించడం లేదో చెప్పాలని పలువురు ఆందోళన చేపట్టారు. అనంతరం అభ్యర్థులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రశ్నపత్రం తయారీ నుంచి ఫలితం వరకు పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో మొదటి ర్యాంకు వచ్చిన అభ్యర్థికి ఇప్పుడు మూడో ర్యాంకు వచ్చిందన్నారు. మొదటి ర్యాంకు వచ్చిన అభ్యర్థికి ఉద్యోగావకాశం కల్పించామని చెప్పారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి



నూతన కార్యవర్గంతో ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తానమని నాయకులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన రీజియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య (అచ్చంపేట), ప్రధాన కార్యదర్శిగా దార సుందర్ (కల్వకుర్తి) ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, భాస్కర్, రామన్న, మహిళా కార్యదర్శిగా భాగ్య, ప్రచార కార్యదర్శిగా సురేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోపాల్, ఇమ్మానియెల్, యాదయ్యను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ పుర కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులును నియమించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఛైర్మన్ రాజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ హాజరయ్యారు.

ఆసుపత్రి కార్మికులపై అసత్య ఆరోపణలు తగవు



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలమూరు, న్యూస్‌టుడే: ఆసుపత్రి కార్మికులపై అసత్య ఆరోపణలు, అక్రమ కేసులు పెట్టడం, కక్షపూరితంగా వేధింపులకు పాల్పడటం సరికాదని కార్మికులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. కార్మిక సంఘం ఎదుగుదలను చూడలేక కొంత మంది తమపై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. సంఘ నేతలపై అక్రమ కేసులను పెడుతున్నారని ఆరోపించారు. ఏళ్ల నుంచి తక్కువ వేతనంపై పని చేస్తున్నామని, తమ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్న వారిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆసుపత్రి కార్మిక సంఘం నాయకులు చెన్నయ్య, రంగన్న, బాలకోటి, మన్యం, జగ్గా నాయక్, వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పురపాలికలో నీటి ఎద్దడి నివారించండి



ఏఈకి వినతిపత్రం అందచేస్తున్న పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు

జడ్చర్ల, న్యూస్‌టుడే : అవసరాలకు తగ్గట్టు నీళ్లు రాకపోవడంతో జడ్చర్ల పురపాలికలో నీటి ఎద్దడి ఏర్పడుతోందని, సమస్యను పరిష్కరించాలని జడ్చర్ల పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ సారిక, భారాస కౌన్సిలర్లు అధికారులను కోరారు. మిషన్ భగీరథ ఏఈ మొగులాల్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పురపాలికలో కనీసం 12ఎంఎల్‌డీ నీళ్లు అవసరమని, కానీ తక్కువగా రావడంతో సకాలంలో సరఫరా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పుష్పలత, లత, నవనీత, నందకిషోర్‌గౌడ్, బుక్కమహేష్, శశికిరణ్, ప్రశాంత్‌రెడ్డి, భారాస నాయకులు ఇఫ్తేఖార్, వెంకటయ్య, నర్సింహా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నవాబ్‌పేట మార్కెట్ ఛైర్మన్‌గా హరలింగం



నవాబ్‌పేట, న్యూస్‌టుడే : నవాబ్‌పేట బాలాజీ వ్యవసాయ మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ కమిటీని ఎంపిక చేస్తూ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ సెక్రటరీ రమేశ్‌కుమార్ తెలిపారు. మార్కెట్ ఛైర్మన్‌గా మరికంటి హరలింగం, వైస్‌ఛైర్మన్‌గా విస్లావత్ తుల్సీరాం, సభ్యులుగా నరేశ్, పద్మమ్మ, నర్సింహులు, వెంకటయ్య, శంకర్‌నాయక్, ప్రభాకర్, లాలయ్య, పురుషోత్తంరెడ్డి, జమీరుద్దీన్, శివకుమార్, చంద్రకాంత్, రాఘవేందర్, పీఏసీఎస్ ఛైర్మన్ నవాబ్‌పేట, జిల్లా మార్కెటింగ్ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ జడ్చర్ల, స్పెషల్ ఆఫీసర్ గ్రామ పంచాయతీ నవాబ్‌పేట మొదలగు వారిని ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నూతన ఆవిష్కరణల్లో భాగస్వాములవ్వండి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక అభివృద్ధిని, నూతన ఆవిష్కరణలను అధ్యయనం చేయుటలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ డా.సుకన్య అన్నారు. మంగళవారం జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ-టీఏఎస్‌కే ఆధ్వర్యంలో వైభవ్ కృత్రిమ మేదస్సు కార్యక్రమం నిర్వహించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు హితేశ్, స్వేచ్ఛ ఫౌండేషన్ ప్రతినిధి శశికాంత్ కృత్రిమ మేధస్సు నిర్మాణం, నూతన యాప్స్ తయారి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. టీఎస్‌కేసీ-టీఏఎస్‌కే సమన్వయకర్త నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ నర్మద, టాస్క్ రీజినల్ మేనేజర్ ఎండీ.సీరాజు, టీఎస్‌కేసీ మెంటర్ ప్రతాప్, అధ్యాపకులు శ్రీనివాస్, సులేమాన్, వెంకట్‌రెడ్డి, వనిత, సతీష్, జగన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నిరసన

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపస్ ఆధ్వర్యంలో మంగళవారం జడ్చర్లలో భోజన విరామ సమయంలో పాఠశాలల్లో సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు కచ్చితంగా ఉండాలని, 317 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌గౌడ్, కృష్ణ, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



వెంకటమ్మ

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు మతి స్థిమితం సరిగ్గా లేక తప్పిపోయి సూర్యాపేటకు చేరింది. గుర్తించిన అక్కడి పోలీసులు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. ఆమె పేరు గొల్ల వెంకటమ్మ అని, సొంతూరు దేవరకద్ర అని చెబుతున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే జిల్లా సఖి కేంద్రంలో సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం సూచించారు.

బ్యాంకు ఖాతాల్లో డబ్బు మాయం

జడ్చర్ల, న్యూస్‌టుడే: మాయమాటలు చెప్పి బ్యాంకు అకౌంట్లలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కాజేసిన ఘటన సోమవారం చోటు చేసుకొగ ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. వివరాలిలా ఉన్నాయి.. జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన చెన్నకేశవులుకు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి భార్య పేరున మహిళా సంఘానికి రుణం మంజూరైందని వివరాలు తెలపాలని లింక్ పంపించారు. అతడితో పాటు, మరో వ్యక్తి వివరాలు తెలపడంతో ఇద్దరి ఖాతాలో నుంచి రూ.1.75 లక్షలు కాజేశారు. దీంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు మంగళవారం వీడియో వైరల్ అయ్యింది. ఈ విషయమై ఎస్సై చంద్రమోహన్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. సైబర్ క్రైం జరిగినప్పుడు డబ్బులు రికవరీ జరిగితే తమకు వివరాలు తెలియవని అన్నారు. సైబర్ పోలీసులు తమ స్టేషన్‌కు సమాచారం అందజేయలేదన్నారు. వివరాలు పంపిస్తే కేసు నమోదు చేస్తామన్నారు.

తల్లి, ఇద్దరు కుమారుల అదృశ్యం

జడ్చర్ల, న్యూస్‌టుడే : తల్లి, ఇద్దరు కుమారులు అదృశ్యమైన ఘటనపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం.. జడ్చర్ల మండలం కొత్తతండాకు చెందిన ముడావత్ విష్ణువర్ధన్ సోమవారం పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి రాగ ఇంటి వద్ద భార్య శైలజ(28), కుమారులు మనోజ్, మాన్విక్ ముగ్గురు కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

జడ్చర్ల, న్యూస్‌టుడే : దాడి చేసి గాయపరిచారనే ఫిర్యాదు మేరకు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం.. మండలంలోని తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు సోమవారం ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి భీమయ్య అనుచిత వ్యాఖ్యలు చేశారు. బయటకు వచ్చి చూడగా తనతో పాటు అన్న శేఖర్, వదిన అనురాధను కర్ర, రాయితో దాడి చేసి గాయపరిచాడని బాధితుడు నాగరాజు తెలిపారు. ఈ మేరకు భీమయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భూమి విక్రయ మోసాలపై..

మిడ్జిల్, న్యూస్‌టుడే : ఒకే భూమిని రెండు సార్లు విక్రయించి మోసగించిన అమ్రి ఇర్ఫాన్ బిన్‌హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మిడ్జిల్ గ్రామ శివారు సర్వేనంబర్లలో ప్లాట్లు చేసి విక్రయించి, ఇటీవల వ్యవసాయ భూమిగా చాకలి శ్రీశైలం, పాండులకు విక్రయించిన ఘటనపై తహసీల్దార్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించినందుకు..

మిడ్జిల్ : పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని మున్ననూరు టోల్‌ప్లాజా వద్ద సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా బైరంపల్లి గ్రామానికి చెందిన శేఖర్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి యత్నించాడన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేపడుతున్నామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ, న్యూస్‌టుడే: అటవీశాఖ అధికారులు కొత్తచెరువుతండా సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతి లేకుండా సోమవారం అర్ధరాత్రి అడవిలో వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది నిఘా ఉంచి పట్టుకున్నట్లు మహబూబ్‌నగర్ అటవీశాఖ రేంజ్ అధికారి చంద్రయ్య తెలిపారు. యజమానులైన అశోక్, నరేష్‌లపై మంగళవారం కేసు నమోదు చేశారు. వీరిద్దరు కొన్నాళ్లుగా ఇసుక అక్రమంగా తరలిస్తుంటే ప్రత్యేక నిఘా ఉంచి పట్టుకున్నామన్నారు.